క్లుప్తంగా

పాదరక్షల కోసం ఉచిత కౌంటర్లు

ఇంద్రకీలాద్రిపై ఘాట్‌రోడ్డు, మహా మండపం వద్ద కౌంటర్లలో సేవలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తులు పాదరక్షలను భద్రపరుచుకునేందుకు దేవస్థానం ఉచిత కౌంటర్లను ఏర్పాటు చేసింది. ఈ సేవలు బుధవారం నుంచి భక్తులు వినియోగించుకోవచ్చని ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ కౌంటర్లను కాంట్రాక్టర్ నిర్వహించుకుని, ప్రతి జత చెప్పులకు భక్తుల నుంచి రూ. 2 వసూలు చేసేవారు. అయితే కాంట్రాక్టు గడువు మంగళవారంతో ముగియడంతో ఇకపై కౌంటర్లను ఉచితంగా నిర్వహించాలని ఆలయ ఈవో రామచంద్రమోహన్ నిర్ణయించారు. ఈ మేరకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి దుర్గగుడి ఘాట్‌రోడ్డుతో పాటు మహా మండపం దిగువన ఉన్న కౌంటర్లలో ఉచిత సేవలను అందించనున్నారు. కౌంటర్లలోని సిబ్బంది డబ్బు డిమాండ్ చేసినట్లయితే ఆలయ ప్రాంగణంలోని అధికారులకు, ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో ఫిర్యాదులు తెలియజేయవచ్చని సూచించారు.

ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరి

చల్లపల్లి: ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు కార్డు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారిణి సాయి సింధూ అన్నారు. మండల పరిధిలోని పాగోలు రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ఉపయోగాలను రైతులకు వివరించారు.

ఘంటసాల: మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు విశిష్ట గుర్తింపు నమోదును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ నయూమ్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు బంద్

కోనేరుసెంటర్: ఈనెల 27వ తేదీన ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు మచిలీపట్నంలో మద్యం దుకాణాలను దగ్గరుండి మూసేశారు. మంగళవారం నుంచి 27వ తేదీ వరకు మద్యం దుకాణాలు మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం ఎక్సైజ్ సీఐ కే ప్రకాష్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం అమ్మితే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే తక్షణమే తమకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

అక్రమాల ఘనాపాఠి.. ఆలపాటి

- అధికారాన్ని అడ్డుపెట్టుకొని అరాచకాలు
- ఎన్నికల్లో గెలవడానికి అడ్డదారులు
- పెద్ద ఎత్తున ఐటీ ఉద్యోగుల ఓట్లు చేర్చిన వైనం
- వారిని రప్పించడానికి ఓటుకు రూ.10 వేల చొప్పున ఖర్చు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అధికారాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. బాధితులు ముందుకు వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని వెళ్లబోసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన దళితులనే కాకుండా సొంత సామాజికవర్గం నేతలను కూడా వదలలేదని చెబుతున్నారు. గుంటూరు చంద్రమౌళీ నగర్‌కు చెందిన రాయపాటి రాజ్యలక్ష్మి భర్త గుళ్లపల్లి సుబ్బారావు తమ భూమిని టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా ఆక్రమించారని ఆరోపిస్తున్నారు. తన భార్య పేరిట ఉన్న ఆస్తిని ఆక్రమించుకుని అందులో ఎన్ఆర్ఐ అగ్రిటెక్ అనే సంస్థను నడుపుతున్నారని, దీని కోసం 15 ఏళ్లుగా పోరాడుతున్నట్లు ఆయన చెబుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని శాతవాహన కళాశాల వివాదంలో కూడా ఆలపాటి పాత్ర ఉంది. నగరం నడిబొడ్డును కోట్ల విలువ చేసే 5.10 ఎకరాల వివాదంలో అప్పట్లో మంత్రిగా ఉన్న ఆలపాటి రాజా జోక్యం చేసుకున్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కళాశాలను తన గుప్పెట్లో ఉంచుకోగా.. గతంలో సెక్రటరీగా పని చేసిన జి. ప్రజాపతిరావు కళాశాల తనదేనంటూ రాజేంద్రప్రసాద్‌తో విభేదించారు. చివరకు ఈ విషయం హైకోర్టు వరకు వెళ్లింది. హైకోర్టు 2012 ఫిబ్రవరి 17న ఆలపాటి కరస్పాండెంట్‌గా ఉన్న కమిటీ చెల్లదని ఉత్తర్వులు జారీ చేసింది. వీటి అమలుకు ఆలపాటి అడ్డు పడుతున్నారని ప్రజాప్రతిరావు ఆరోపిస్తున్నారు. వివాదం తేలే వరకు శాతవాహన కళాశాల స్థలం విషయంలో యథాతథ స్థితిని (స్టేటస్ కో) కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీం ఆదేశాలను ధిక్కరించి అధికార పార్టీ నాయకులు స్థలాన్ని కబ్జా చేయడానికి ఒక్కో అడుగూ వేస్తూ పోతున్నారు.



ఆలపాటి అనుమతితో శాతవాహన కళాశాలలో ఎగ్జిబిషన్‌కు అనుమతి (ఫైల్)



విజయవాడ విశాలాంధ్ర రోడ్డులోని శాతవాహన కాలేజీ గ్రౌండ్

అడ్డదారులు

ఇన్ని అక్రమాలు చేసిన ఆలపాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం కూడా అడ్డదారులు తొక్కుతున్నారు. ఎన్నికల ముందు వ్యూహాత్మకంగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో పనిచేస్తున్న వారి వివరాలు తీసుకుని వారి ఓట్లు చేర్పించారు. వారంతా ఎప్పుడో ఇక్కడి నుంచి వెళ్లిపోయి బయట ఉద్యోగ రీత్యా స్థిరపడిపోయినా వారందరి ఓట్లు చేర్పించి వారి ఓట్లతో గెలవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వారిని అక్కడి నుంచి రప్పించి ఓట్లు వేయించేందుకు ఒక్కొక్కరికి పది వేల రూపాయల వరకూ ఖర్చు చేయడానికి సిద్ధపడినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. వివాదం తేలే వరకు ఎలాంటి కార్యకలాపాలూ ఆ స్థలంలో నిర్వహించడానికి వీల్లేకపోయినా.. ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడానికి శాతవాహన కళాశాల కమిటీ కార్యదర్శి హోదాలో నాటి టీడీపీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ అనుమతి ఇవ్వడం గమనార్హం.

పెద పలకలూరులో భూమి ఆక్రమణపై ఫిర్యాదు

ఈనామ్ భూములను వారసత్వం పేరుతో వీలునామాలు సృష్టించి 2004లో గుంటూరు రూరల్ మండలం పెద పలకలూరు గ్రామంలో 46.82 ఎకరాల భూమిని ఆక్రమించినందున ఆలపాటి రాజా నామినేషన్‌ను జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి తక్షణమే రద్దు చేయాలని దళిత సంఘ నాయకుడు పిల్లి బాబురావు గతవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

సిమెంట్ కంపెనీ కార్మికులకు బెదిరింపులు

తాడేపల్లిలో 31 ఏళ్ల క్రితం మూతపడిన సిమెంట్ కంపెనీ కార్మికులకు రావాల్సిన నష్టపరిహారం కోసం కార్మికులు ఆందోళన ఉధృతం చేశారు. వంద రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ వ్యవహారంలో కూడా ఆలపాటి రాజా హస్తం ఉండటం గమనార్హం. తాడేపల్లిలో ఉన్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీని 1989లో ఎఫ్ఐఎల్‌కు తర్వాత హెచ్ఎంపీ అనే సంస్థలకు పది రూపాయల స్టాంప్ పేపర్‌పైన బదిలీ చేసింది. 1993లో ఉద్యోగులకు స్వచ్ఛంద పదవి విరమణ ప్రకటించి అదే ఏడాది మే 29 అర్ధరాత్రి యాజమాన్యం ఫ్యాక్టరీకి అక్రమ లాకౌట్ ప్రకటించింది. స్వచ్ఛంద పదవీ విరమణకు సంతకాలు చేసిన కార్మికులకు కూడా డబ్బులు ఇవ్వకుండా మోసం చేసింది. తర్వాత ఈ భూములను కోల్‌కతా కోర్టులో వేలం వేస్తే ప్రస్తుత మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరితో పాటు మరికొందరు కలిసి ఈ భూమిని కొన్నారు. తర్వాత దీన్ని ఎన్ఆర్ఐ అకాడమీకి అమ్మినట్లు చూపించారు. ఆ సమయంలో ఆలపాటి జోక్యం చేసుకుని ఫ్యాక్టరీని పూర్తిగా తొలగించి, స్థలాన్ని చదును చేయించారు. కార్మికులపై బెదిరింపులకు దిగారు. 2015లో కార్మికులకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. సెంట్రల్ లేబర్ కోర్టు, హైకోర్టులు ఏసీసీ కార్మికులకు రూ.43 కోట్లు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాయి. వీటిని అమలు చేసే నాథుడు లేకుండా పోయాడు. ఈ అంశంపై మంత్రి లోకేష్ న్యాయం చేస్తానని ఎన్నికల ముందు ప్రకటించినా తర్వాత పట్టించుకోవడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

అవనిగడ్డ డీఎస్పీ దివ్యశ్రీ



కోడూరు: కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోస్తును ఏర్పాటు చేస్తున్నట్లు అవనిగడ్డ డీఎస్పీ దివ్యశ్రీ తెలిపారు. మంగళవారం కోడూరులోని పోలింగ్ కేంద్రాన్ని డీఎస్పీ పరిశీలించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పది పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారులు ఏర్పాటు చేశారని, వీటి వద్ద కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ప్రశాంతం వాతావరణంలో పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. రాజకీయ పార్టీల నేతలు కేంద్రాల సమీపంలో ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ శ్రీనునాయక్, ఎస్ఐ చాణిక్య పాల్గొన్నారు.

పెడనలో 1,389 మంది ఎమ్మెల్సీ ఓటర్లు

పెడన: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల వ్యాప్తంగా 1,389 మంది ఓటర్లు ఉన్నారని పెడన ఇంఛార్జి తహసీల్దారు కే అనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ ఎం. గోపాలరావుతో కలిసి పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన భట్టజ్ఞాన కోటయ్య జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడమే కాకుండా పటిష్టంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయిఎడ్ల పోటీలు

విజేత కృష్ణా జిల్లా ఎడ్లు

చినగంజాం: మహా శివరాత్రి పురస్కరించుకోని సోపిరాల రామకోటేశ్వరాలయం ప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ విభాగం నాటుబండి పోలు రాధా ఎడ్ల పోటీలు ముగిశాయి. మొదటి బహుమతిని కృష్ణా జిల్లా మోపిదేవికి చెందిన తుంగల నాగసింధు, కోకి శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 3500 మీటర్లు లాగి గెలుపొందాయి. రూ.30 వేలు నగదును టీఎస్సార్ ఆంజనేయులు, రెండో బహుమతిని మోపిదేవికి చెందిన మత్త నాని ఎడ్ల జత 3470.7 మీటర్లు లాగాయి. రూ.25 వేలు నగదును ఆమంచి నరసింహారావు దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ఆమంచి వెంకట సుబ్బారావు, శ్రీనివాసరావు అందించారు.

మూడో బహుమతిని కృష్ణాజిల్లా తోట్లవల్లూరు గ్రామానికి చెందిన కళ్లం అనుషారెడ్డి, మనోజ్ రెడ్డి ఎడ్ల జత 3408.4 మీటర్లు లాగి గెలుపొందగా పోలకం వెంకట రమణ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు నరసింహారావు, శ్రీనివాసరావు రూ.20 వేలు అందించారు. ఎనిమిదో బహుమతిని కృష్ణా జిల్లా చల్లపల్లికి చెందిన తుమ్మల వెంకట్రావు ఎడ్లజత 2750.6 మీటర్లు లాగి గెలుపొందారు. మోపిదేవి క్రోసూరి వారి పాలెంనకు చెందిన కాగితాల శశిధర్ ఎడ్ల జత 2750 మీటర్లు లాగారు. కార్యక్రమంలో టీఎస్సార్ ఆంజనేయులు, సీతారామయ్య,సుబ్బారావు, నరసింహారావు, గంటా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఎడ్ల పందెంలో విజేతలకు బహుమతులందిస్తున్న నిర్వాహకులు

బడ్డీ కొట్లు తొలగింపు



మచిలీపట్నంటౌన్: నగరంలోని రిజిస్ట్రార్ కార్యాలయం, పోర్టు కార్యాలయాల ప్రహరీ వెంబడి ఉన్న ఆక్రమిత బడ్డీలను నగరపాలకసంస్థ టౌన్ ప్లానింగ్ విభాగ సిబ్బంది మంగళవారం తొలగించారు. బడ్డీలను జేసీబీ, క్రేన్‌ల సాయంతో తొలగించారు. ఈ కార్యాలయాల ప్రహరీల వెంబడి బడ్డీలను ఏర్పాటు చేసి దస్తావేజుల టైపింగ్, ఫొటోస్టాట్ తదితర సేవలను అందించేవారు. ఈ రోడ్డులో ఉన్న బడ్డీలతో తరచూ ట్రాఫిక్ సమస్య ఎదురయ్యేది. ఈ సమస్యను తొలగించేందుకు ఈ ఆక్రమణలను తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ తొలగింపును నగర కమిషనర్ బాపిరాజు, టీపీఓ హరి ప్రసాద్ పర్యవేక్షించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తం

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో జరిగే శాసన మండలి పట్టభద్రుల ఎన్నిక కోసం నిర్వహించే పోలింగ్ ప్రక్రియలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, సక్రమంగా నిర్వహించడంలో నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించే ఈ పోలింగ్‌కు ఎన్నికల సంఘం నియమ నిబంధనలు, మార్గదర్శకాలను విధిగా పాటించాలన్నారు. గురువారం ఉదయం నుంచి బ్యాలెట్ బాక్సులు, పేపర్లు, పోలింగ్ సామగ్రి పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి తీసుకున్న పోలింగ్ మెటీరియల్ చెక్ లిస్ట్, బ్యాలెట్ బాక్సులు పోలింగ్ బాక్సులను ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ల సీరియల్ నంబర్లు, వాటి కౌంటర్ పాయింట్‌పై ఉన్న సీరియల్ నంబర్లు ఒకేలా ఉండాలన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులకు వేసే సీలు, టెంపరరీ స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించేటప్పుడు నోడల్ అధికారులు పోలింగ్ కేంద్రాల పరిధిలో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఏఎస్పీ వీవీ నాయుడు, నోడల్ అధికారులు ఎల్ నిత్యానందం, బి.మురళీకృష్ణ, వీఎస్ శ్రీనివాసనాయక్, వి సెలివ్న, ఎస్ రవికుమార్, ఎస్.వెంకట్రావు పాల్గొన్నారు.



నోడల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

రాజకీయ పార్టీల ప్రతినిధులతో..

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఈ నెల 27న పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. ఆయన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. డీఆర్వో చంద్రశేఖరరావు, కొడాలి శర్మ, పీవీ గజేంద్రరావు, ఎస్ బాలాజీ, కె ఫణిభూషణ్, కొట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

ఐదు కేజీల గంజాయి స్వాధీనం

తొమ్మిది మంది అరెస్ట్

కంచికచర్ల: గంజాయి విక్రేతలు తొమ్మిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. కంచికచర్ల పరిధిలో యువత మత్తుకు చిత్తవుతున్నారు. దీనిపై పోలీసులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు మాత్రం గంజాయి విక్రయాలు, రవాణాపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఈనెల 24న 'గుప్పు మంటున్న గంజాయి' శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన పోలీసులు కంచికచర్లతోపాటు పలు గ్రామాల్లో గంజాయి విక్రయాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నిఘా ఉంచి 9 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కంచికచర్ల పీఎస్‌లో నందిగామ సబ్ డివిజన్ ఏసీపీ బాలగంగాధర్‌తిలక్ మంగళవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం మండలంలోని పరిటాల శివారు నక్కలంపేట గ్రామ శ్మశానవాటికకు వెళ్లే రోడ్డులో ముళ్లపొదల వద్ద పోలీసులు వెళ్లి చూడగా ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి విచారణ జరిగింది. వారి నుంచి రూ. 25 వేల విలువైన 2.5 కేజీల గంజాయిని పట్టుకున్నారు. పరిటాలకు చెందిన రాజేష్, దమ్మాలపాటి మురళీకృష్ణ, షేక్ సల్మాన్, సురేష్‌తో పాటు మరో మైనర్‌ను అరెస్ట్ చేశారు. అదే రోజు రాత్రి ఆ ప్రాంతంలో నిఘా పెట్టగా మరో నలుగురు వ్యక్తుల నుంచి రూ. 17,500 విలువైన 2.5 కేజీల గంజాయిని పట్టుకున్నారు. వారిలో షేక్ గాలీషాతో పాటు మరో ముగ్గురు మైనర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి 46 సెల్‌ఫోన్లను, బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను నందిగామ కోర్టులో హాజరుపర్చామని, మిగిలిన నలుగురు మైనర్లను విజయవాడలోని జువైనల్ కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఏసీపీ అన్నారు. గంజాయి విక్రయించేవారిని పట్టుకున్న నందిగామ రూరల్ సర్కిల్ సీఐ డీ చవాన్, కంచికచర్ల, వీరులపాడు ఎస్ఐలు రాజు, అనిల్, కానిస్టేబుళ్లు వై వేణు, ఈ మురళీ, జీ అశోక్, జీ నాగమల్లేశ్వరరావు, బి. ఉపేంద్ర, వి.వీరబాబు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



కంచికచర్ల పీఎస్‌లో మాట్లాడుతున్న ఏసీపీ తిలక్, పక్కన సీఐ చవాన్

సాక్షి ఎఫెక్ట్

ఘనంగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు

అవనిగడ్డ/చల్లపల్లి/ తాడేపల్లి(ఘంటసాల): నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చంద్రశేఖరరావు ఇంటి వద్ద పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే వైఎస్సార్ సీపీ చల్లపల్లి మండల యువజన అధ్యక్షుడు వెనిగళ్ల తారక జగదీష్ ఆధ్వర్యంలో చల్లపల్లి ప్రధాన సెంటర్‌లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలో మంగళవారం డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత తాతినేని వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నేతలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చల్లపల్లిలో వృద్ధులకు పండ్లు అందజేస్తున్న సింహాద్రి వెంకటేశ్వరరావు

కేఎస్ లక్ష్మణరావును గెలిపించండి

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, మేధావులు మద్దతు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరుతో మాట్లాడుతూ లక్ష్మణరావును గెలిపిస్తే అందరికీ మంచి జరుగుతుందని చెప్పారు. మేధావులు, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లలందరూ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో అవనిగడ్డ, పులిగడ్డ సర్పంచ్‌లు గొరుముచ్చు ఉమా, దాసరి విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అవతార్ మెహెర్ బాబా జయంతి

చల్లపల్లి: చల్లపల్లిలోని అవతార్ మెహెర్‌బాబా 131వ జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి పూజలు చేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బాబా వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆయన వెంట చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి తదితరులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

కోనేరుసెంటర్: వాహనదారులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని బందర్ డీఎస్పీ చప్పిడి రాజా పేర్కొన్నారు. మచిలీపట్నం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ పరిమితి వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబంలోని వ్యక్తులను కోల్పోవడమే కాకుండా, కుటుంబాలు ఆర్థికంగానూ, సామాజికంగాను వెనుకబడి పోతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. వాహనాలను నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కలిగిస్తున్న డీఎస్పీ రాజా

మేలైన విత్తనాలు అందించాలి

ఘంటసాల: రైతులకు మేలైన మినుము విత్తనాలను అందించడంలో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన పాత్ర పోషించాలని అపరాలు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మోహన్‌రెడ్డి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంవారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం క్షేత్రంలో బ్రీడర్ విత్తనోత్పత్తి చేస్తున్న పొలాలను విత్తనోత్పత్తి పర్యవేక్షణ బృందం మంగళవారం సాయంత్రం పరిశీలించింది. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని విత్తనోత్పత్తి పర్యవేక్షణ బృందం కేవీకే క్షేత్రంలో చిరుసంచుల దశలో ప్రయోగాత్మకంగా వేసిన టీబీజీ 141, జీబీజీ 190 మినుము రకాల పనితీరును, చీడపీడల తట్టుకునే శక్తి, మొదలైన అంశాలను పరిశీలించి రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో కృష్ణా మండలి విత్తనోత్పత్తి అధికారి డాక్టర్ ఎస్.హరిసత్యనారాయణ, ప్రజనన (ప్లాంట్ బ్రీడింగ్) విభాగ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జె.సతీష్ బాబు, కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.సత్యప్రియ లలిత తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాలలో పొలాలను పరిశీలిస్తున్న విత్తనోత్పత్తి పర్యవేక్షణ బృందం

మినుముకు కలుపుతోనే ఎక్కువ ప్రమాదం

నిమ్మగడ్డ(చల్లపల్లి): మినుముకు చీడపీడల కంటే కలుపుతోనే ఎక్కువ ప్రమాదం ఏర్పడుతుందని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి వి/జ్ఞాన కేంద్రం(ఘంటసాల) శాస్త్రవేత్తలు అన్నారు. మంగళవారం మండలం పరిధిలోని నిమ్మగడ్డ ప్రాంతాల్లో వరి మాగాణుల్లో వేసిన మినుము పంటను డాక్టర్ సుధారాణి, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం .వెంకటలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలుపు వల్ల మినుము దిగుబడి 20 నుంచి 30 శాతం వరకు తగ్గుతుందని చెప్పారు. మినుము పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టినప్పుడే అధిక దిగుబడులు పొందగమని వివరించారు. చీడపీడల నివారణతో పాటు రైతులు పంటలో కలుపును కూడా పూర్తిస్థాయిలో నివారించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. వారి వెంట సిబ్బంది సుబ్బారెడ్డి, రైతులు ఉన్నారు.

క్లుప్తంగా

పద్మావతి డిగ్రీ కళాశాలను సందర్శించిన వీసీ

కోనేరుసెంటర్: మచిలీపట్నంలోని పద్మావతి డిగ్రీ కళాశాలను కృష్ణా విశ్వ విద్యాలయం ఉపకులపతి కూన రాంజీ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి అక్కడి వసతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య, హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులకు విద్యాబోధన ఏ విధంగా జరుగుతున్నది ఆరా తీశారు. హాస్టల్ వసతి, క్యాంటీన్ సదుపాయం తదితర అంశాలపై కళాశాల ప్రిన్సిపాల్‌తో చర్చించారు. కళాశాలకు విచ్చేసిన వీసీకి అధ్యాపకులు ఘన స్వాగతం పలికారు.

అప్రంటిషిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

మచిలీపట్నంఅర్బన్: భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ ప్రొఫెషనల్ ఎలక్ట్రానిక్స్ సంస్థగా గుర్తింపు పొందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)లో గ్రాడుయేట్, గ్రాడుయేట్ (సాధారణ), టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటిస్షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వచ్చేనెల రెండవ తేదీన మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో (నేషనల్ కాలేజ్) రాత పరీక్ష నిర్వహించన్నారు. బీఈ/బీటెక్, గ్రాడుయేట్ అప్రెంటిస్షిప్ (సాధారణ)కు బీకామ్, టెక్నీషియన్ డిప్లొమా అప్రెంటిస్షిప్‌కు డిప్లొమా 2020 మార్చి ఒకటి నాటికి లేదా ఆ తర్వాత పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులు ఎన్ఏటీఎస్.ఎడ్యుకేషన్.జీఓవీ.ఇన్ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి.

పులిగడ్డ సర్పంచ్‌కు సత్కారం



అవనిగడ్డ: మదర్ థెరిస్సా విశిష్ట సేవా పురస్కారం అందుకున్న పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్‌ని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సత్కరించారు. ఇటీవలె వచ్చిన వరదలు, కోవిడ్ సమయంలో ప్రజలకు విశిష్ట సేవలు అందించినందుకు హైదరాబాద్‌కు చెందిన విశ్వ ఆర్ట్స్ నిర్వాహకులు ఈ సేవా పురస్కారాన్ని హైదరాబాద్‌లో విజయ్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సింహాద్రి స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విజయ్‌కుమార్‌ని సత్కరించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అమెరికా సదస్సుకు ఆహ్వానం

అవనిగడ్డ: అమెరికాలోని ఫిలడెల్ఫియాలో జరిగే మొదటి ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ (ఏఏఏ) నేషనల్ కన్వెన్షన్‌కు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ని ఆహ్వానించారు. స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో ఏఏఏ న్యూజెర్సీ ప్రెసిడెంట్ సత్య వెజ్జు మంగళవారం బుద్ధప్రసాద్‌ని కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. మార్చి 28, 29వ తేదీల్లో జరిగే మొదటి నేషనల్ కన్వెన్షన్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెడన: మండల పరిధిలోని బలిపర్రు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, జూనియర్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థినులు హెచ్‌టీటీపీ//ఏపీబీఆర్ఏజీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 2024–25 సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థినులు ఐదో తరగతిలో ప్రవేశానికి అర్హులన్నారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశ పరీక్ష రాయడానికి 2024–25 ఏడాదిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు అర్హులన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ ఆరో తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఐదోలో ప్రవేశానికి మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. అర్హులైన వారు మార్చి ఆరవ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఇన్‌చార్జి అధికారులు రారు.. ఉన్న వారేమో సెలవు!

వెలవెలబోతున్న ఎంపీడీవో కార్యాలయం



ఎంపీడీవో కార్యాలయంలోని ఏఓ ఛాంబర్‌లో విధుల్లో ఉన్న ఇద్దరు ఉద్యోగులు

పెడన: మండల పరిషత్ కార్యాలయం ఎంపీడీవో ఇంచార్జిగా మచిలీపట్నం ఎంపీడీవో సీహెచ్ వెంకటేష్‌కు బాధ్యతలను అప్పగించారు. ఈయనకు ముందు విధులు నిర్వహించిన వీ రెడ్డయ్య బదిలీ అవ్వడంతో ఆయన స్థానంలో ఈవోపీఆర్డీ జయరాంకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన గత నెల జనవరిలో పదవీ విరమణ చేయడంతో ఇంఛార్జి ఎంపీడీవో పోస్టుతో పాటు ఈవోపీఆర్డీ పోస్టులు ఖాళీ ఏర్పడ్డాయి. దీంతో మచిలీపట్నం ఎంపీడీవోకు పెడన ఎంపీడీవోగాను, మచిలీపట్నం ఈవోపీఆర్డీకి పెడన ఈవోపీర్డీగా బాధ్యతలను అప్పగించారు. ఏమైనా సమావేశాలుంటే తప్ప వీరు రాని పరిస్థితి. ఇక కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి జీ(ఏఓ) శిరిషాకుమారి మూడు రోజులు సెలవు పెట్టారు. సీనియర్ అసిస్టెంట్ విజయ వారం రోజులు సెలవు పెట్టారు. దీంతో జూనియర్ అసిస్టెంట్ కేశవ్, టైపిస్టు విజయలు మాత్రమే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఒక అటెండరు, మరొక అవుట్ సోర్సింగ్ అటెండరు మాత్రమే కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండటం విశేషం. ఉన్నతాధికారులు ఎవరూ లేకపోవడంతో కార్యాలయంలో విధులు నిర్వహించే వారు కూడా సక్రమంగా సమయానికి రావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వీరి పరిధిలో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి ఇక చెప్పనవసరం లేదనే విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పాలకులు కోరుతున్నారు.

సెలవులో ఉన్నారు

ఈ విషయమై ఇంఛార్జి ఎంపీడీవో సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ ఏఓ, సీనియర్ అసిస్టెంట్‌లు సెలవు పెట్టారని తెలిపారు. ఈవోపీఆర్డీకి ఎన్నికల విధులు ఉండటంతో వారు కూడా రెండు మండలాల బాధ్యతలను నిర్వహిస్తూ బిజీగా ఉన్నారు. నేను ఇప్పటికే పెడన మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టాను. ఎటువంటి ఫైల్స్ పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవడమే కాకుండా పంచాయతీ కార్యదర్శుల సమయ పాలనపై కూడా దృష్టిపెట్టడం జరుగుతుంది.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

మచిలీపట్నంటౌన్: స్థానిక రుస్తుంబాద మున్సిపల్ బాలికల హైస్కూల్‌ల్లో గత ఆరు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న అంశాలను చిన్నారులకు పూర్తి స్థాయిలో వివరించి వారిలో మంచి పరిజ్ఞానం పెంపొందేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వైఎస్సార్‌కే గురుప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీఓ గ్లోరి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. తొలుత అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పలు విద్యా, విషయక అంశాల చిత్రాలను, బొమ్మలను పరిశీలించి కార్యకర్తలను అభినందించారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని అర్తమూరు జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ మంగళవారంతో ముగిసింది. రెండు బ్యాచ్‌లుగా ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంఈఓ బి. త్రిపురసుందరీ దేవీ, హెచ్‌ఎం. సిహెచ్. రామచంద్రరావు, సూపర్‌వైజరు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెడన: స్థానిక బంగ్లా స్కూల్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్ల శిక్షణ మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కృష్ణా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్యామ్ సుందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని అంగన్‌వాడీ టీచర్లకు దిశానిర్దేశం చేశారు. అనంతరం శిక్షణ పొందిన అంగన్‌వాడీ వర్కర్లకు సర్టిఫికెట్లను అందించారు. ఎంఈవో–2 వైవీ హరనాథ్, సీడీపీవో సముద్రవేణి, రిసోర్స్ పర్సన్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో పేపర్‌తో చేసిన జడను పరిశీలిస్తున్న ఎంఈఓలు

గూడూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మచిలీపట్నం డీవైఈఓ బి.ఎస్.సి.శేఖర్ సింగ్ అంగన్‌వాడీ కార్యకర్తలకు ధృవ పత్రాలను పంపిణీ చేశారు. ఎంఈఓ–2 పి.సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సీడీపీఓ కె.గ్లోరి, సూపర్‌వైజర్లు ఉషశ్రీ, రేవతి పాల్గొన్నారు.

'దక్షిణకాశీ' పెదకళ్లేపల్లి

ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న కృష్ణానది

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మహాశివరాత్రి శివ భక్తులకు ఎంతో ఇష్టమైంది. భక్తులు శివాలయాలకు వెళ్లి ఆ మహాదేవుని దర్శించుకుని పూజలు చేస్తే పుణ్యం వస్తుందని భావిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని పవిత్ర శైవక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న పెదకళ్లేపల్లి దక్షిణకాశీగా పేరుగాంచింది. కాశీలో ప్రవహిస్తున్నట్లు ఇక్కడ కృష్ణానది ఉత్తర దిక్కుగా ప్రవహించి సముద్రంలో కలుస్తోంది. అందుకే దక్షిణకాశీగా పిలువబడుతోంది. ఈ నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరుని దర్శించుకుంటే పాప పరిహారం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే కాశీకి వెళ్లలేని వారు పితృదేవతలకు పిండ ప్రధానం చేసి కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వేలసంఖ్యలో శివరాత్రికి భక్తులు తరలివస్తారు.

ఆలయ స్థల పురాణం

పూర్వం ఈ క్షేత్రాన్ని రంభాపురం, నాగేశ్వరక్షేత్రం, కదలీపురం అని పిలిచేవారు. కాలక్రమేణా కళ్లేపల్లిగా రూపాంతరం చెందింది. ఈ క్షేత్రమందు కశ్యప ప్రజాపతి పుత్రులగు కర్కోటక, వాసుకి, తక్షక మొదలగు అష్ట ఫణి రాజులు తమ తల్లి శాప విముక్తికై శిలా వేదిక నిర్మించి, ఈశాన్య భాగంలో సరోవరం తవ్వి ఆ జలముతో శివుని అభిషేకించి పూజింపగా స్వామి ప్రత్యక్షమయ్యారు. కంగారు పడిన వారు కదళీ, కదళీ అను కేకలు వేయడంతో అంతట స్వామివారు నేను ఉద్భవించు సమయాన మీరు వేసిన కదళీ, కదళీ కేకలతో ఈ క్షేత్రం కదళీపురంగా ప్రసిద్ధి చెందుతుందని అన్నారు. ఈ క్షేత్ర మహత్యం గురించి అగస్త్య మహర్షి శ్రీరామ చంద్రునికి చెప్పినట్లు పద్మ పురాణంలో ఉంది. ఆలయంలో శ్రీ పార్వతీ, దుర్గా, సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీ కాలభైరవ, నవగ్రహ ఆలయాలు ఉన్నాయి. ముఖద్వారంలో ఐదు అంతస్తుల గాలి గోపురం, ఆలయం లోపల సత్య స్తంభం ఉన్నాయి. ఈ సత్య స్తంభంకు ఓ ప్రత్యేకత ఉంది. గతంలో ఓ వ్యాపారస్తుడు ప్రజలను మోసం చేయడంతో అతడిని ఈ ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద విచారించగా, నేరం రుజువు కావడంతో ఆ ధ్వజ స్తంభం విరిగిపోయిందని, అప్పటి నుంచి భక్తులు తొలుత ఆ సత్యస్తంభంను దర్శించుకున్న తర్వాతనే స్వామివార్లను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. శాసనాల ఆధారంగా క్రీస్తుశకం 1292లో సోమశివాచార్యులచే ఆలయం నిర్మించబడి, క్రీస్తుశకం 1782లో చల్లపల్లి ప్రభువులైన శ్రీ రాజా యార్లగడ్డ కోదండ రామయ్య ప్రభువుచే ప్రాకారాదులు కట్టబడినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది.



పెదకళ్లేపల్లిలో నాగేశ్వరస్వామివారి దేవాలయం

శివరాత్రికి శివాలయాలు ముస్తాబు

యార్లగడ్డ(చల్లపల్లి): చల్లపల్లి మండల పరిధిలోని యార్లగడ్డ గ్రామంలో కొలువై ఉన్న శ్రీగంగా పార్వతీ సమేత శ్రీనాగమల్లి కోటేశ్వరస్వామి ఆలయం శివరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆలయం వద్ద చలువ పందిళ్లు వేసి ప్రత్యేకంగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. సంతానం లేని వారికి సంతానం ప్రసాదించే దైవంగా ఈ స్వామి వాసికెక్కారు.

మచిలీపట్నంటౌన్: మహా శివరాత్రికి నగరంలోని పలు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. నాగులేరు కాలువ గట్టుపై ఉన్న రసలింగేశ్వరస్వామి ఆలయం, చింతగుంటపాలెం, ఖొజ్జిల్లిపేటలోని నాగేశ్వరస్వామి ఆలయాలు, రాబర్ట్సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, గాంధీబొమ్మ శివాలయం, జోడుగుళ్ల, గొడుగుపేట, బచ్చుపేట శివాలయాలు పూజలకు సిద్ధమయ్యాయి.

గూడూరు: శివరాత్రికి మండలంలోని అన్ని శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు దేవదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి టీవీవీ మోహనరావు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

పెడన: పట్టణంతో పాటు మండలంలోని శైవక్షేత్రాలు శివరాత్రికి ముస్తాబు చేశారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీలు తెలిపాయి.

కృత్తివెన్ను: కృత్తివెన్నులో కొలువై ఉన్న స్వయంభు శ్రీ దుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి ఉత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరిగింది. ఆలయ ఈఓ సింగనపల్లి శ్రీనివాసరావు గణపతి పూజతో ఉత్సవాలను ప్రారంభించారు.

కోడూరు: శివరాత్రి సందర్భంగా మండలంలోని శైవక్షేత్రాలను ఆలయ కమిటీల నిర్వాహకులు ముస్తాబు చేశారు. లింగారెడ్డిపాలెం బాలాత్రిపురసుందరీ సమేత శ్రీగోకర్ణేశ్వరస్వామి, హంసలదీవిలోని కాశీవిశ్వేశ్వరస్వామి, మాచవరంలోని రామలింగేశ్వర స్వామి, సాలెంపాలెంలోని అగస్త్యేశ్వర స్వామి తదితర ఆలయాలను ఉత్సవాలకు ముస్తాబు చేశారు.

నేడు శాంతి కల్యాణం

లక్ష్మీపురం(చల్లపల్లి): చల్లపల్లి మండలం నడకుదురులోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీపృథ్వీశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరగనున్నాయి. సాయంత్రం శాంతి కల్యాణం నిర్వహించనున్నారు.



ముస్తాబైన రసలింగేశ్వరస్వామి ఆలయం

లక్ష్మీపురం(చల్లపల్లి): చల్లపల్లి మండలం లక్ష్మీపురంలోని శ్రీబాలపార్వతీ సమేత శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పెళ్లి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి స్వామి వారిని పెళ్లి కుమారునిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా ముస్తాబు చేశారు.